క్లుప్తంగా

పోలీస్ శాఖకు డ్రోన్ అందజేత



డ్రోన్‌ను పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చికి అందజేస్తున్న వరుణ్‌గ్రూపు ప్రతినిధులు

అల్లిపురం: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా వరుణ్ గ్రూప్ సంస్థ నగర పోలీస్ కమిషనరేట్‌కు అత్యాధునిక డ్రోన్‌ను అందజేసింది. మంగళవారం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చిని కలిసి డ్రోన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అత్యాధునిక డ్రోన్ల ద్వారా నగరంలో శాంతిభద్రతలు పరిరక్షించడంతో పాటు, నేరాల నియంత్రణ, నేర పరిశోధన కూడా చేయవచ్చని కమిషనర్ అన్నారు. వీవీపీల భద్రతా ఏర్పాట్లలో నిఘా కోసం వీటిని ఉపయోగించవచ్చని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని డ్రోన్లు నగర పోలీసు శాఖ వినియోగించేలా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. వైజాగ్‌లో ప్రతి అడుగునా పోలీసు లేదా డ్రోన్ నిఘా ఉండాలన్నదే తమ లక్ష్యమని అన్నారు.

సేవలకు సత్కారం



కోన ప్రకాష్‌కు జ్ఞాపిక బహూకరిస్తున్న డాక్టర్ అర్జున్

డాబాగార్డెన్స్: జై భీమ్ సంస్థ గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాలలో విద్య, వైద్య శిబిరాలతో పాటు క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సంస్థ కన్వీనర్ కోన ప్రకాష్ చేస్తున్న నిరంతర సేవలను గుర్తించి అంబేడ్కర్ భవన్ నూతన కమిటీ మంగళవారం ఘనంగా సత్కరించింది. అంబేడ్కర్ భవన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ అర్జున్ స్వయంగా కోన ప్రకాష్‌కు జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ భవన్ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు, కార్యదర్శి ప్రభాకరరావు, జై భీమ్ సభ్యులు కోన శంకర్, సన్యాసిరావు, వెంకట్, రాము, జయరాజ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు బియ్యం పంపిణీ

అల్లిపురం: పేదలకు 3 కేజీల బియ్యం చొప్పున 33వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు పచ్చిరిపల్లి రాము అందజేశారు. ప్రతి నెల చేపట్టే కార్యక్రమంలో భాగంగా ఆయన మంగళవారం పేదల ఇళ్లకు వెళ్లి బియ్యం అందజేశారు. ప్రతి నెల 25 మంది పేదలకు బియ్యం పంపిణీ చేయటం జరుగుతుందన్నారు.

పెట్రో భారం తగదు



ఆటో డ్రైవర్లతో కలిసి ఆందోళన చేస్తున్న వామనమూర్తి

సీతమ్మధార: కేంద్ర ప్రభుత్వం భారీగా పెంచిన డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలు వెంటనే రద్దు చేయాలి ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత బీజేపీ ఆటో డ్రైవర్స్ అండ్ మోటార్ కార్మికుల మీద ఆర్థిక భారాలు వేసే విధంగా డీజిల్ పెట్రోల్ వంట గ్యాస్ ధరలను భారీగా పెంచి ఆర్థిక భారం మోపిందన్నారు. మంగళవారం ద్వారకా నగర్ జంక్షన్ వద్ద ఆటోడ్రైవర్లు నిరసన ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వామనమూర్తి బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్ మోటార్ వాహన డ్రైవర్లు నిరసన ధర్నా చేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కళ్లు తెరిపించాలని డ్రైవర్లకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యు. శివాజీ, దేవుడు, ఈశ్వర్, రావి కృష్ణ, మురళి పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ ధర పెంపుపై నిరసన నేడు

పెందుర్తి: వంట గ్యాస్ సిలిండర్‌పై కేంద్ర ప్రభుత్వం రూ.50 పెంచినందుకు నిరసనగా బుధవారం పెందుర్తి నాలుగు రోడ్ల కూడలి వద్ద ఆందోళన నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా సమితి సభ్యుడు వై.రాంబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభంకానున్న ఆందోళనకు ప్రజలంతా తరలిరావాలని కోరారు.

అభాగ్యులకు ఆత్మబంధువులు



పాతనగరం స్వామి వివేకానంద సంస్థ వద్ద..

స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ – ఆశ్రయం– ఆహారం

పాత నగరంలో కొలువై ఉన్న స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ వందలాది మంది పేదలు, వలస కూలీలు, కార్మికులు, అభాగ్యులకు నిత్యం అన్నప్రసాదం అందజేస్తోంది. ఈ సంస్థలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులతో పాటు, బయట ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి సుమారు 300 నుంచి 400 మంది నిరుపేదలు, వలస కూలీలు, కార్మికులకు మధ్యాహ్న భోజనం అందిస్తోంది.



జిల్లా పరిషత్ సమీపాన బుధవరపు గార్డెన్స్‌లో మార్వాడీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం

రోజుకు వేల మందికి భోజనం

అన్నార్తుల ఆకలి తీర్చుతున్న స్వచ్ఛంద సంస్థలు

డాబాగార్డెన్స్: ఆకలితో అలమటించే వారికి అన్నం పెట్టడం ఒక గొప్ప సేవ. ఈ సత్కార్యాన్ని ఎన్నో స్వచ్ఛంద సంస్థలు నిరంతరం కొనసాగిస్తున్నాయి. అన్నదాన కార్యక్రమాల్లో ఈ సంస్థలు పోషిస్తున్న పాత్ర ఎంతో కీలకమైనది. పేదలు, నిరుపేదలు, వలస కూలీల ఆకలి తీరుస్తూ సమాజంలో పేదరికాన్ని తగ్గించడంలోనూ, సామాజిక శ్రేయస్సును పెంపొందించడంలోనూ ఇవి సహాయపడుతున్నాయి. విశాఖపట్నంలో అనేక స్వచ్ఛంద సంస్థలు ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాయి. అన్నం పరబ్రహ్మ స్వరూపం. జీవితంలో ఏదైనా లోపించినా కొంతకాలం జీవించగలం, కానీ ఆహారం లేకపోతే మనుగడ సాధ్యం కాదు. అందుకే పెద్దలు అన్ని దానాలలోకీ అన్నదానం గొప్పదని చెబుతారు. అన్నదానాన్ని మించిన ఉత్తమమైన దానం మరొకటి లేదనడంలో సందేహం లేదు.మనం ఏ వస్తువును దానంగా ఇచ్చినా, ఎంత ఎక్కువగా ఇచ్చినా, తీసుకున్నవారికి ఇంకా కావాలనే కోరిక ఉండవచ్చు. కానీ అన్నదానం చేసినప్పుడు, ఆ భోజనం తిన్నవారు కడుపు నిండి 'ఇక చాలు' అని సంతృప్తిగా లేస్తారు. ఇతర దానాలతో గ్రహీతను పూర్తిగా సంతృప్తిపరచడం కష్టం కావచ్చు, కానీ అన్నదానం ద్వారా అది సాధ్యమవుతుంది.కొందరు అన్నదానాన్ని ఒక పవిత్రమైన యజ్ఞంలా భావించి సేవాభావం చాటుకుంటున్నారు.



కేజీహెచ్ వోపీ గేట్‌కు ఎదురుగా సత్యసాయి వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..

సత్యసాయి వెల్ఫేర్ ట్రస్ట్ – ఆపన్నహస్తం

నగరంలోని సత్యసాయి వెల్ఫేర్ ట్రస్ట్ నిత్యం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. కేజీహెచ్ వోపీ గేటు ఎదురుగా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 గంటలకు సుమారు 300 మంది నిరుపేదలు, వోపీకి వచ్చే రోగులు, వారి సహాయకులకు ఈ సంస్థ భోజనం అందిస్తోంది. అలాగే, ఆర్కే బీచ్ బస్టాప్ ఎదురుగా ఉన్న ఆర్కే మిషన్ వద్ద మరో 200 మంది నిరుపేదలు, అభాగ్యులకు సైతం అన్నదానం చేస్తోంది.

పేదలకు అండగా.. మార్వాడీ చారిటబుల్ ట్రస్ట్

నగరంలోని జిల్లా పరిషత్ సమీపంలోని కృష్ణానగర్‌లో ఉన్న మార్వాడీ సంస్థ (చారిటబుల్ ట్రస్ట్) ప్రతిరోజూ దాదాపు 300 మంది నిరుపేదలు, వలస కూలీలు, అపార్ట్‌మెంట్లలో పనిచేసే వాచ్‌మెన్‌ల కుటుంబాలకు మధ్యాహ్న భోజనం అందిస్తోంది.

ఎందరో మహానుభావులు

ఈ మూడు సంస్థలే కాకుండా, నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో, ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద మరెన్నో స్వచ్ఛంద సంస్థలు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా వందలాది మంది పేదలకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నాయి. అంతేకాకుండా, రైల్వే స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్, జగదాంబ జంక్షన్ వంటి రద్దీ ప్రదేశాల్లో రోడ్డు పక్కన నిలువ నీడ లేని ఎందరో అభాగ్యులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తూ మానవత్వాన్ని చాటుతున్నాయి. ఈ స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషి నిజంగా అభినందనీయం. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం ద్వారా వారు ఎంతోమంది జీవితాల్లో వెలుగు నింపుతున్నారు.

వందలాది మందికి భోజనం..



సంస్థలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులకే గాక నిరుపేదలు, కార్మికులు, వలస కూలీల కోసం నిత్యం వందలాది మందికి మధ్యాహ్నం భోజనం అందజేస్తున్నాం. కొన్ని సందర్భాల్లో రాత్రి వేళల్లో కూడా భోజనం పెడుతున్నాం. అభాగ్యులు..నిరుపేదలు ఆకలితో అలమటించకూడదన్న లక్ష్యంతో..స్వామి వివేకానందుని ఆశయ సాధనతో సేవా కార్యక్రమం పలువురు దాతల సహకారంతో నిర్వహిస్తూ వస్తున్నాం. పండగ వేళల్లో మరింత ఎక్కువ మందికి భోజనం పెడుతున్నాం.

–సూరాడ అప్పారావు, అధ్యక్షుడు, స్వామి వివేకానంద సంస్థ

అమ్మలా అన్నం పెడుతూ



వివేకానంద సంస్థ మాలాంటి ఆకలితో ఉన్న వారికి అమ్మలా పిలిచిమరీ అన్నం పెడుతున్నారు. మధ్యాహ్నం 12 అవ్వగానే సంస్థ వద్దకు వచ్చి భోజనం చేస్తున్నా. నాలాంటి వారికి ఇక్కడ భోజనం లభించడం అదృష్టంగా భావిస్తున్నా..

–సత్యవతి, నిరుపేద

మంచి భోజనం పెడతున్నారు..



పేదలమని..అభాగ్యులమనే తేడా లేకుండా మంచి భోజనం పెడతున్నారు. అన్నం, పప్పు, రసం, ఓ కూర పెడతున్నారు. చాలా బాగుంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండలో కష్టపడుతున్న మాలాంటి వారి ఎందరికో భోజనం పెట్టి ఆకలి తీరుస్తున్నారు.

–అప్పారావు, నిరుపేద

వంటగ్యాస్ ధర తగ్గించాలంటూ సీపీఐ వినూత్న నిరసన



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వినూత్న నిరసన తెలుపుతున్న సిపిఐ నాయకులు

సీతమ్మధార: పెంచిన గ్యాస్ ధరను తక్షణమే రద్దు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ వినూత్న నిరసన వ్యక్తం చేసింది. గ్యాస్ బండ నెత్తిన పెట్టుకుని ఆందోళన చేసింది. అనంతరం మహిళలంతా కలిసి కట్టెల పొయ్యిపై వంటావార్పు చేశారు. దేశవ్యాప్తంగా వంట గ్యాస్ సిలిండర్ ధరలను కేంద్ర ప్రభుత్వం భారీగా పెంచడాన్ని సీపీఐ తీవ్రంగా వ్యతిరేకించింది. మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు మాట్లాడుతూ గృహావసరాలకు వినియోగించే 14.2 కిలోల ఎల్పీజీ గ్యాస్ బండపై రూ.50 చొప్పున పెంచడంవలన పేద ప్రజలపై మరింత భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వంట గ్యాస్ ధరలు పెంపుతో సాధారణ వినియోగదారులు, ఉజ్వల పథకం లబ్ధిదారులు ఒక్కో బండపై అదనంగా రూ.50 చెల్లించాల్సి ఉంటుందన్నారు. వెంటనే పెంచిన వంట గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ.విమల, ఎస్‌కే రెహమాన్, పి.చంద్రశేఖర్, ఎం.మన్మథరావు, జి.రాంబాబు, సీఎస్. క్షేత్రపాల్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు జేడీ నాయుడు, ఎ. దేముడమ్మ, జి. జయ, పి. సూర్య పద్మ, బి. పుష్పలత, ఎస్. నాగభూషణం, పి. గోవింద్, ఆదారి ఆదినారాయణ, ఎం .శ్రీనివాస రావు, జె .అన్వేషి, రాంప్రభు, హేమంత్, అభి తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం

డాబాగార్డెన్స్: నగర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశం రసాభాసగా సాగింది. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు ఎవరో తెలియని పరిస్థితిలో గందరగోళంగా మారింది. కాంగ్రెస్ పార్టీ విశాఖ జిల్లా పార్లమెంట్ అధ్యక్షుడు నూతన్‌కుమార్ నేతృత్వంలో మంగళవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కార్యకర్తలు విరుచుకుపడ్డారు. పార్టీకి సంబంధంలేని వ్యక్తులకు టికెట్లు ఇచ్చారని, ఇప్పుడు వారు ఎక్కడున్నారో తెలియని పరిస్థితి ఉందన్నారు. అసలు కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఉందా? లేదా? అనే మీమాంశలో ఉందని..అందుకు ఉదాహరణే గత కొంత కాలంగా ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించకపోవడమని ధ్వజమెత్తారు. పార్టీకి జిల్లా అధ్యక్షుడు ఎవరో? నగర అధ్యక్షుడు ఎవరో తెలియకుండా పోయిందని తన ఆవేదనను నూతన్‌కుమార్ వద్ద వెళ్లగక్కారు. పార్టీ కార్యాలయంలోని బ్యానర్లు చించేశారు. ఒకరినొకరు తోసుకున్నారు. దీంతో నూతన్‌కుమార్ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ప్రతి వీధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



మహిళా చట్టాలు, సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పిస్తున్న సీఐ యర్రంనాయుడు.

అల్లిపురం: ప్రతి వీధిలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని టూటౌన్ సీఐ యర్రంనాయుడు సూచించారు. మంగళవారం సాయంత్రం ఆయన తన సిబ్బందితో కలిసి విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా కళ్లపాకలు ప్రాంతంలో పర్యటించారు. స్థానికంగా నివసిస్తున్న గృహస్తులను, మహిళలను, పిల్లలను ఒక దగ్గరకు చేర్చి వారితో మాట్లాడారు. ముఖ్యంగా పోక్సో కేసులు, సైబర్ క్రైమ్, మహిళలపై నేరాలు, అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి, డ్రగ్స్ వినియోగం, అమ్మకాలు జరిపితే చట్టపరంగా తీసుకునే చర్యల గురించి ఆయన అవగాహన కల్పించారు.

ఆహా..ఏమి'ట్రీ' పచ్చదనం



గ్రీష్మ తాపంలోను వసంతం వెల్లివిరుస్తోంది. వేసవి కాలంలోనూ పచ్చదనం పరుచుకుంది. రైల్వే న్యూకాలనీ రోడ్డులో భారీ చెట్టుకు పచ్చని ఆకులు కమ్మేశాయి. ఎటుచూసినా పచ్చదనంతో ఆ రోడ్డు కళకళలాడుతోంది.

మండే ఎండ..పరదా చాటున



విశాఖలో ఎండలు మండిపోతున్నాయి. ఉదయం నుంచి దంచికొడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎండ నుంచి ఉపశమనానికి విద్యుత్ స్తంభానికి చిన్న పరదా ఏర్పర్చుకుని అమ్మకాలు సాగిస్తున్న చిరు వ్యాపారి.

–ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి.. పూజలో పాల్గొన్న పలువురు దంపతులు

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్

డాబాగార్డెన్స్: వేసవి కాలంలో వడదెబ్బ తగలకుండా నగర ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం స్టేక్ హోల్డర్స్‌తో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేష్ కుమార్ మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలో పలు చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, అలాగే నివాస సంక్షేమ సంఘాల సభ్యులు, ఎన్జీవోలు, ఇతర స్వచ్ఛంద సంస్థలు కూడా నగరంలో చలివేంద్రాల ఏర్పాటుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. వారికి కూడా జీవీఎంసీ సహకారం అందిస్తుందని, వారు కోరిన మేరకు తాగునీరు అందిస్తామని చెప్పారు. వేసవిలో మధ్యాహ్నం వేళ వృద్ధులు, పిల్లలు తప్పని పరిస్థితిలో తప్ప బయటకు రావొద్దని, వదులుగా ఉన్న తెలుపు రంగు కాటన్ దుస్తులు ధరిస్తే మంచిదని సూచించారు. కార్యక్రమంలో జీవీఎంసీ పర్యవేక్షక ఇంజినీరు రాజేంద్ర కృష్ణ, జోనల్ కమిషనర్లు మల్లయ్యనాయుడు, శివప్రసాద్, ఏఎంఓహెచ్‌లు డాక్టర్ సునీల్ కిషోర్, డాక్టర్ అప్పలనాయుడు, బి ప్రసాదరావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రుణమేళాకు విశేష స్పందన



ఆశీల్‌మెట్ట జోన్–3 ఆఫీస్‌లో బీసీ కార్పొరేషన్ రుణాల కోసం పోటెత్తిన దరఖాస్తుదారులు

సీతమ్మధార: ఆశీల మెట్టలోని జోన్–3 కార్యాలయం దరఖాస్తుదారులతో నిండిపోయింది. జోనల్ కమిషనర్, యూసీడీ అధికారులు, బ్యాంక్ అధికారులు, బీసీ కార్పొరేషన్ అధికారులు కలిసి రుణాల మంజూరుపై అవగాహన కల్పించారు. బీసీ, కాపు, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరు చేసేందుకు మంగళవారం నిర్వహించిన రుణ మేళా ఇంటర్వ్యూలకు మంచి స్పందన లభించింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 2024–2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బీసీ, కాపు, బ్రాహ్మణ, క్షత్రియ, రెడ్డి, వైశ్య, ఈబీసీ కార్పొరేషన్ల నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి పథకాల కింద వివిధ యూనిట్లకు బ్యాంకు రుణాలు, సబ్సిడీ మంజూరు కోసం 14 వార్డుల నుంచి 2,184 మంది దరఖాస్తు చేసుకున్నారు.జోన్–3 జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ శివప్రసాద్ అధ్యక్షతన దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఉద యం 9.30 నుంచి 14 నుంచి 20 వార్డుల వారికి, మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 7 వరకు 21 నుంచి 27 వార్డుల దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇప్పటి వరకు 14 వార్డుల నుంచి 1,634 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ రంజిత్ కుమార్, ఆర్. కోటేశ్వరరావు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ అజయ్ కుమార్, ఏపీజీవీబీ బ్యాంక్ మేనేజర్ జయలక్ష్మి, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, ఏపీడీ రాము, వార్డు కార్పొరేటర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాల చెల్లింపునకు సహకరించండి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల పెండింగ్ జీతాల చెల్లింపునకు సహకరించాలని ఉక్కు అధికారుల సంఘం (సీ) నాయకులు మంగళవారం ఎంపీ శ్రీభరత్‌కు వినతిపత్రం అందజేశారు. వీఆర్ఎస్, పదవీ విరమణల వల్ల సుమారు 1600 మంది ఉద్యోగులు తగ్గిపోయారన్నారు. అదే విధంగా కాంట్రాక్ట్ సిబ్బందిని ఇప్పటికే 2000 మందిని తగ్గించారని వివరించారు. రాబోయే మూడు నెలల్లో మరో 400 మంది ఉద్యోగులు పదవీ విరమణ చేయబోతున్నారన్నారు.ఉద్యోగుల జీతాలు సెప్టెంబర్ 2024 నుంచి పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఇప్పటి వరకు సుమారు 230 శాతం చెల్లించాల్సి ఉందన్నారు. దాని వల్ల ఉన్నత విద్య కోసం రుణాలు కోసం వెళ్లిన ఉద్యోగులకు ప్రతికూల క్రెడిట్ రేటింగ్‌ల కారణంగా రుణాలు మంజూరు కావడం లేదన్నారు. ఎంపీ భరత్ మాట్లాడుతూ జీతాలు త్వరలో చెల్లించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సీ అధ్యక్షుడు కాటం చంద్రరావు, పెన్షన్ వారియర్స్ ద్వారం స్వామి నాయుడు, దుడ్డు శ్రీనివాస్ జె.ఎ. స్వామి, పి. వెంకటరావు పాల్గొన్నారు.

డేట్ ఆఫ్ జాయినింగ్ సమస్య పరిష్కరించాలని వినతి

అక్కిరెడ్డిపాలెం: సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ , కార్మికుల డేట్ ఆఫ్ జాయినింగ్‌లో తప్పులను సరి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ భెల్ (హెచ్‌పీవీపీ) గుర్తింపు యూనియన్ నాయకులు మంగళవారం ఎంపీ భరత్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కొందరికి పీఎఫ్ ఎంట్రీ 1992కు బదులు 1997గా నమోదైందని, కొందరికి 2011గా నమోదు కావడంతో హయ్యర్ పెన్షన్ రిజక్ట్ అయిందని తెలిపారు. ఈ అంశాన్ని సంబంధిత మంత్రి, భెల్ యాజమాన్యంతో చర్చించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో గుర్తింపు యూనియన్ నాయకులు బొండ బాబూరావు, సుభాకర్ సాహూ, పి.వి.ఎస్.రాజు, కొల్లి దేముడు, టెక్కలి భాస్కరరావు, అల్లం వెంకటేశ్వరరావు, టి.ఎల్.నర్సింగరావు, అప్పలరాజు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

కూటమి నేతలకు తలొగ్గిన పోలీసులు



పోలీసులతో మాట్లాడుతున్న కూటమి నేతలు

జగదాంబ: కూటమి నాయకులకు పోలీసులు తలొగ్గారు. పార్కింగ్ స్థలంలో జంగిడలు పెట్టకూడదంటూ నగర పోలీసు కమిషనర్ ఆదేశాలు జారీచేయడంతో జంగిడలు తొలగించి పార్కింగ్‌కు సుగమనం చేసిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో కాంట్రాక్టర్ బుచ్చి రామిరెడ్డి కూటమి చెందిన వ్యక్తి కావడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. చిరువ్యాపారులకు అవకాశం కల్పించాలని కూటమి నేతలు పోలీసులకు చెప్పడంతో వారు వెనక్కు తగ్గారు. అయితే కార్ల పార్కింగ్ ఎదురుగా కాకుండా వెనుక భాగంలో మార్కింగ్ చేసి ఒక్కొక్క వ్యాపారికి రెండు జంగడిలు మాత్రమే పెట్టుకునే విధంగా పోలీసులు అనుమతించారు. దీంతో బుధవారం నుంచి యథావిధిగా జంగిడిలు ఏర్పాటు చేసుకోనున్నారు.